www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 31 జులై 2024

మిగులు భూముల లెక్క తేల్చండి

జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ అద్దయ్య

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో నిర్వాసితులకు కేటాయించగా మిగిలిన భూముల లెక్క తేల్చాలని జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ అద్దయ్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల ఆర్‌అండ్‌ఆర్ భూములు కేటాయించిన గ్రామాల విఆర్‌ఒ, సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. ఆర్‌అండ్‌ఆర్ భూముల లెక్కల గురించి విఆర్‌ఒల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా నిర్వాసిత కుటుంబాలకు కేటాయించిన ఆర్‌అండ్‌ఆర్ భూములకు సంబంధించి సాగు భూమి ఎంతుంది, మిగిలిన భూమి ఎంత ఉందనేది సమగ్రంగా సర్వే చేసి పూర్తి ఆధారాలతో రావాలని సిబ్బందిని ఆదేశించారు. నిర్వాసితులకు కేటాయించిన భూముల్లో దళారుల ప్రమేయం లేకుండా చూడాలన్నారు.

ఇసుక రాదాయే..!

చేబ్రోల్ ఇసుక స్టాక్ పాయింట్ పరిస్థితి ఇది

- స్టాక్ పాయింట్ల నుంచి సరఫరా నిల్
- చేబ్రోలు స్టాక్ పాయింట్ వల్ల ప్రయోజనం శూన్యం
- రెండు జిల్లాల్లోనూ ప్రజలకు తప్పని కష్టాలు
- ఎక్కడికక్కడ నిలిచిన నిర్మాణ పనులు
- మళ్లీ పెరిగిన ఇసుక దళారీల దందా
- ఆరు యూనిట్ల ధర రూ.22 వేలకు విక్రయం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇసుక కోసం రెండు జిల్లాల ప్రజానీకం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పాలసీ మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు లేకపోవడంతో ఇసుక కోసం నానాతంటాలు పడాల్సి వస్తోంది. ఇదే అదునుగా ప్రయివేటు ఇసుక దందా పెట్రేగిపోతుంది. దీంతో గతంకంటే రూ.నాలుగైదు వేలు ధర ఎక్కువ చెల్లిస్తే తప్ప ఇసుక దొరికే పరిస్థితి లేకుండాపోయింది. జులై ఎనిమిదో తేదీన ఉచిత ఇసుక పాలసీని ప్రభుత్వం ప్రకటించింది. ఇసుక స్టాక్ పాయింట్లలోని ఇసుక విక్రయాలకు ధర నిర్ణయించింది. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు మండలంలోని చేబ్రోలు ఇసుక పాయింట్ వద్ద టన్ను ఇసుక ధర రూ.538గా నిర్ణయించింది. ఇప్పటి వరకూ ఈ స్టాక్ పాయింట్ నుంచి ఇసుక విక్రయించిన పరిస్థితి లేకుండాపోయింది. ఈ స్టాక్ పాయింట్‌లో ఇసుక నిల్వలు లేవు. దీంతో ఈ స్టాక్ పాయింట్ ఎందుకని జనం ప్రశ్నిస్తున్నారు. కుక్కునూరు మండలం వింజరం, ఇబ్రహీంపేటలో ఉన్న మూడు స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక విక్రయాలు ప్రారంభించారు. అక్కడ నుంచి సైతం ఇసుక సరఫరా సరిగా జరగడం లేదు. వరదలు రావడంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారిపోయింది. చేబ్రోలు, ఏలూరులో ఉన్నవారికి కుక్కునూరు మండలం వంద కిలోమీటర్లకుపైగా దూరం ఉంది. అక్కడ నుంచి ఇసుక తీసుకురావాలంటే రవాణా ఛార్జీలు తడిసి మోపెడవుతాయి. ఈ పాయింట్లలో ఇసుక జిల్లా ప్రజలకు పెద్దగా ఉపయోగపడని పరిస్థితి ఉంది. వింజరం, ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్లలో ఇసుక ఎక్కువగా తెలంగాణకు తరలిపోతుంది. దీంతో ఏలూరు జిల్లా ప్రజానీకం ఇసుక దొరక్క నానావస్థలు పడుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ అదే పరిస్థితి నెలకొంది. ఈ జిల్లాలో ఆచంట మండలం కోడేరు, కరుగోరుమిల్లి, పెనుగొండ మండలం సిద్ధాంతంలో రెండు, నడిపూడిలో రెండు మొత్తం ఆరు ఇసుక ర్యాంపులు ఉన్నప్పటికీ ప్రస్తుతం మూతపడి ఉన్నాయి. యలమంచిలి, నరసాపురంలో ఐదు డీసిల్టేషన్ పాయింట్లు ఉన్నప్పటికీ అక్కడ ఇసుక లేదు. తూర్పుగోదావరి జిల్లాలోని నిడదవోలు మండలం పందలపర్రు, పెరవలి మండలంలోని పెండ్యాల, ఉసులుమర్రులో ఇసుక అందుబాటులో ఉందని ప్రకటించినా ఇసుక సరఫరా లేదని జనం చెబుతున్నారు. దీంతో ఇసుక ఎక్కడ నుంచి తెచ్చుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. వరద వెళ్లే వరకూ స్టాక్‌పాయింట్లలో ఇసుక సరిపోతుందని నిన్నటి వరకూ చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఏ స్టాక్ పాయింట్ నుంచీ ఇసుక సరఫరా సక్రమంగా లేని పరిస్థితి నెలకొంది.

బ్లాక్‌లో కొనుగోలు చేస్తేనే ఇసుక

ఇసుక దొరక్క జిల్లాలో కొనసాగుతున్న నిర్మాణాలు చాలా వరకూ నిలిచిపోయాయి. ఇసుక కోసం నానా తంటాలు పడుతున్నా దొరకడం లేదు. బ్లాక్‌లో మాత్రం యథేచ్ఛగా దొరుకుతున్న పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో ఆరు యూనిట్ల ఇసుక రూ.18 వేలకు దొరకగా, ఇప్పుడు బ్లాక్‌లో అదే ఆరు యూనిట్ల ఇసుక రూ.22 వేలకు విక్రయిస్తున్న పరిస్థితి ఉంది. ఉచిత ఇసుక అంటూ ప్రచారం చేసి ఇసుక దొరకకకుండా చేస్తారా అంటూ జనంలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిర్మాణాలు ఆగిపోవడంతో కొంతమంది గత్యంతరం లేని పరిస్థితుల్లో బ్లాక్‌లోనే ఇసుక కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. బ్లాక్‌లో సాగుతున్న ఇసుక దందాను కట్టడి చేసి, ఇసుక అందించాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయం కొరవడినట్లు తెలుస్తోంది. ఇసుక ఎప్పుడు సరఫరా చేస్తారని రెండు జిల్లాల ప్రజానీకం ప్రశ్నిస్తున్నా సమాధానం చెప్పేవారే లేకుండా పోయారు. ఇసుక సరఫరా లేకపోవడంతో పనులు నిలిచిపోయి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండాపోతుంది. ఇసుక సరఫరాపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

ఇసుక లేక ఇంటి పని ఆగిపోయింది..

పి.వెంకటేశ్వరరావు, నిడమర్రు మండలం

ఇంటి నిర్మాణం చివరి దశకు చేరుకుంది. పది రోజులుగా ఇసుక కోసం ప్రయత్నిస్తున్నా దొరకడం లేదు. దీంతో నిర్మాణ పనులు ఆపేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉచిత ఇసుక అన్నారని ఎంతో సంతోషించాం. అసలు ఇసుకే అందకుండాపోయింది. బ్లాక్ మార్కెట్లో ఆరు యూనిట్ల ఇసుక రూ.22 వేలు వరకూ చెబుతున్నారు. అంతా సొమ్ము చెల్లించి కొనుగోలు చేయలేక ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. చేబ్రోలు స్టాక్ పాయింట్‌లో ఇసుక అందుబాటులోకి తెస్తే ఇబ్బంది తొలుగుతుంది.

మళ్లీ పెరుగుతున్న గోదావరి వరద

13 రోజులుగా ముంపులోనే రహదారులు

19 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగు కాజ్‌వేపై వరద

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

మండలంలోని ప్రధాన రహదారులపై గోదావరి వరద నీరు చేరి ముంపునకు గురవ్వడంతో 13 రోజులుగా మండలంలోని 19 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల విద్యార్థులు కుక్కునూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీకి రావాల్సి ఉంది. ఇప్పటికే వరి నారు, మొక్క దశలో ఉన్న పత్తి పంటలను గోదావరి వరద ముంచెత్తడంతో ఆ ప్రాంత రైతులు విత్తనాలు, పురుగుమందుల కోసం ఆయా గ్రామాలకు చెందిన వ్యాపారులు మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సిన దుస్థితి ఏర్పడింది. గోదావరి వరదల వల్ల బస్సులు, ఆటోలు తిరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోదావరి వరద తగ్గుముఖం పట్టి సోమవారం భద్రాచలంలో 42 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. మంగళవారం మళ్లీ నిదానంగా పెరుగుతూ 43.6 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. ఎగువ ప్రాంతాల్లోని ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదులుతుండటంతో గోదావరి వరద తగ్గుతూ పెరుగుతూ విలీన మండలాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు, కూలీలు గోదావరి వరదతో ఏంచేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు.

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ వ్యకాస ఆధ్వర్యాన రాస్తారోకో

నినదిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

ప్రజాశక్తి - కామవరపుకోట

కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీకి, వ్యవసాయ రంగానికి నిధుల కోత విధించడం దుర్మార్గమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి ఆరోపించారు. మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కామవరపుకోట-ఏలూరు రోడ్డుపై స్థానికంగా రాస్తారోకో నిర్వహించారు. అనంతరం కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు, వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. రోజువారీ వ్యవసాయ పనులు చేసుకునే పేదలకు, ఉపాధి హామీ కూలీలకు నిధుల కేటాయింపు సరిగా లేదన్నారు. వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయింపు లేకపోవడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ రంగాన్ని ప్రయివేటు, కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టేలా ఉందన్నారు. పోలవరం నిర్వాసితులకు బడ్జెట్లో కేటాయింపులు లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి బడ్జెట్లో నిధుల కేటాయింపు సరిగ్గా లేదని, విశాఖ, కడప ఉక్కు ఫ్యాక్టరీలు, రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ వంటి వాటికి నిధులు కేటాయించకపోవడం వల్ల ఆంధ్ర రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని, బడ్జెట్లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీకి రూ.86 వేల కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది పేదలకు ఆసరాగా ఉన్న ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించడం దుర్మార్గమన్నారు. పేదలకు వరంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడిచేలా బడ్జెట్లో నిధులు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్పొరేట్లకు వరంగా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. ఈ కేటాయింపులపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు జె.సత్యనారాయణ, తామా ముత్యాలమ్మ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, నాయకులు మహంకాళరావు, ప్రభాకర్‌రావు, గవర సత్యనారాయణ, సీత, హోలీ మేరీ, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ కారుపై దాడి జరగలేదు

పోలవరం డిఎస్‌పి సురేష్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు కారుపై సోమవారం రాత్రి రాయి దాడి వల్ల అద్దం పగల్లేదని పోలీసులు స్పష్టం చేశారు. పోలవరం డిఎస్‌పి ఎస్.సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జీలుగుమిల్లి మండలంలోని బర్రింకలపాడు ఎంఎల్‌ఎ ఇంటి నుంచి ఎంఎల్‌ఎ కారులో అనుచరులు సోమవారం రాత్రి జీలుగుమిల్లి బయల్దేరారు. కారు బర్రింకలపాడు జంక్షన్ స్పీడ్ బ్రేకర్ వద్ద సడన్ బ్రేక్ వేయగా ఒక్కసారిగా అద్దం పగిలింది. దీంతో కారులో ఉన్న వారు గుర్తు తెలియని వ్యక్తి రాయి విసరడంతో అద్దం పగిలిందని ఫిర్యాదు చేయడంతో అప్రమత్తమైన పోలీసులు మూడు బృందాలుగా దర్యాప్తు చేపట్టారు. ఎంఎల్‌ఎ ఇంటి వద్దే కారు కోసం షెడ్ పనులు పోల్ ఒకటి కార్ అద్దానికి తగిలి అద్దం బీటలిచ్చింది. అది గమనించని ఎంఎల్‌ఎ అనుచరులు కారులో జీలుగుమిల్లి వెళ్తుండగా ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేయడంతో అద్దం ధ్వంసమైందని తెలిపారు. దీనిలో ఎవరి ప్రమేయం లేదని వివరించారు.

విద్యార్థుల ఉన్నతి కోసమే ఉచిత పుస్తకాలు

గత ప్రభుత్వం విద్యను భ్రష్టు పట్టించింది

ఇంటర్ విద్యార్థులకు

పుస్తకాల పంపిణీలో ఎంఎల్‌ఎ ధర్మరాజు

విద్యార్థులు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ, అధికారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

పేద విద్యార్థులను గత పాలకులు పట్టించుకోలేదని, ఇంటర్ విద్యార్థులకు కనీసం పాఠ్య, రాత పుస్తకాలు ఇవ్వకుండా ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసిందని ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు 215 మందికి ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య, రాత పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బివి.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఆర్.ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, అనుబంధ జూనియర్ కాలేజీల్లో చదివే పిల్లలకు టెక్స్ట్‌బుక్స్, రాత పుస్తకాలు, బ్యాగులను సరఫరా చేసే క్రమంలో ఏలూరు జిల్లాలో 235 కాలేజీల్లో సుమారు 5 వేల మంది విద్యార్థులకు రూ.2.5 కోట్ల విలువైన విద్యాసామగ్రి ఇస్తున్నామన్నారు. ఎంఎల్‌ఎ ధర్మరాజు మాట్లాడుతూ ఈకాలేజీని 1968లో స్థాపించిన విద్యాదాత కీర్తిశేషులు చింతలపాటి వరప్రసాదసీతారామ మూర్తిరాజు పుట్టిన పత్తేపురంలోనే తాను కూడా పుట్టడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీ విద్యను పెంపొందించేందుకు ఆనాడు మూర్తిరాజు వేసిన బీజానికి మద్దతు అన్నట్టుగా కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి ఉచితంగా పుస్తకాలు అందివ్వడంపై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. డిగ్రీ కాలేజీ అభివృద్ధి, ప్రణాళిక సంఘం అధ్యక్షుడు ఈపూరి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదవి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభిలాషించారు. సర్పంచి దిడ్ల అలకనంద మాట్లాడుతూ బాలికలు తల్లిదండ్రుల పట్ల గౌరవంగా ఉంటూ క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ విశ్వేశ్వరరావు, మానవత నాయకులు సాగిరాజు జానకీరామరాజు, మానవత మండల అధ్యక్షుడు వేగేశ్న రంగరాజు, విశ్రాంత కమాండో దిడ్ల శ్రీను, బిసి నాయకుడు గురువెళ్లి రాజారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఆదర్శంగా నిలవాలి

హోమ్ మేడ్ చాక్లెట్లను ప్రోత్సహించాలి : కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు దేశానికే ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని గౌతమి సమావేశ మందిరంలో నాబార్డు ఆధ్వర్యంలో మంగళవారం రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పిఒ) ఏర్పాట్లపై ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తులకు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా అధిక రాబడి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని వ్యవసాయ ఉత్పత్తులకు అన్‌సీజన్ వాటి ధర తక్కువగా ఉంటుందని, వాటికి డిమాండ్ ఉన్న సమయంలో అమ్మకాలు సాగించేలా వాటిని నిర్జలీకరణ (డీహైడ్రేట్) విధానం లేదా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో కోకో పంట ఎక్కువగా ఉంటుందని, వాటితో రైతుల ద్వారా ఊటీ, కొడైకెనాల్ వంటి ప్రాంతాల్లో మహిళలు ఇంట్లోనే ఎక్కువగా తయారుచేసే, ప్రాచుర్యం కలిగిన హోమ్ మేడ్ చాక్లెట్లను జిల్లాలోనూ ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నూజివీడు మామిడి రసాలు దేశవ్యాప్తంగా బ్రాండ్ కలిగి ఉన్నాయని, వాటికి రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘంలో కనీసం 300 మంది సభ్యులు ఉండాలని, జిల్లాలో ప్రస్తుతం 17 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడంతోపాటు, సబ్సిడీపై యాంత్రీకరణ అందిస్తామన్నారు. పండించిన పంటలకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేసి, జిల్లాలో పెద్దఎత్తున రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఆర్థికాభివద్ధికి చిన్న తరహా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో నాబార్డు డిడిఎం అనిల్‌కాంత్, వ్యవసాయశాఖ జెడి ఎస్‌కె.అబీబ్‌భాషా, డిఇఒ ఎస్.అబ్రహాం, అసిస్టెంట్ ఎల్‌డిఎం చంద్రశేఖర్, ఉద్యాన శాఖ డిడి రామ్మోహన్ పాల్గొన్నారు.

సాగునీరందించడం పట్ల హర్షం

పంట కాలువలను పరిశీలించిన రైతు సంఘం నాయకులు



పంట కాలువలను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కృష్ణా డెల్టా పరిధిలో సాగు భూములకు పట్టిసీమ ఎత్తిపోతల కాల్వ నుంచి సాగునీరు అందించడం పట్ల ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలంలోని పాలగూడెం(మల్కాపురం)లో పంట కాలువలను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. పట్టిసీమ కాలువ నుంచి విడుదల చేసిన సాగునీరు పంట కాలువలకు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గం పరిధిలోని కృష్ణా, గోదావరి డెల్టాల ఆయకట్టు శివారు ప్రాంతంగా ఉందని చెప్పారు. కృష్ణా డెల్టా పరిధిలో భూములకు సక్రమంగా సాగునీరు అందక అన్నదాతలు ఆందోళన చెందారన్నారు. నారు ఎదిగిపోయినా నాట్లు వేయడానికి తగినంత సాగునీరు లేక ఏమి చేయాలో అర్థం కాక ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఈ పరిస్థితుల్లో దెందులూరు నియోజకవర్గం ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్, జలవనరుల శాఖ అధికారులు స్పందించి పట్టిసీమ ఎత్తిపోతల పథకం కాలువ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు సాగునీరు మళ్లించి అన్నదాతలను ఆదుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. సాగునీరు విడుదల పట్ల వర్షం వ్యక్తం చేశారు. అయితే పంట కాలువలు గుర్రపు డెక్క, తూడు, తుక్కుతో నిండిపోవడంతో నీరు సక్రమంగా పారడం లేదని, పంట కాలువలను బాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

బాలలు అప్రమత్తంగా ఉండాలి

ప్రపంచ మానవ అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా పలుచోట్ల అవగాహన

ఏలూరు అర్బన్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రపంచ మానవ అక్రమ రవాణా దినోత్సవ సందర్భంగా మంగళవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ స్థానిక సెయింట్ గ్జేవియర్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో మానవ అక్రమ రవాణా సర్వసాధారణం అయిందని, బాలలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఎదురైనప్పుడు వారితో జాగ్రత్తగా ప్రవర్తించాలని, దగ్గర్లోని ఉపాధ్యాయులకు కానీ, తల్లిదండ్రులకు కానీ తెలియజేయాలని సూచించారు. సంఘ విద్రోహ శక్తులు బాలలను అపహరించడమే కాకుండా వారితో సంఘవిద్రోహ పనులను చేయిస్తున్నారని, అలాగే వెట్టి చాకిరి మొదలైన పనులు చేస్తున్నారని తెలియజేశారు. అటువంటి పరిస్థితులు ఎదురైనప్పుడు 1098 కానీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కానీ సంప్రదించాలని, వారికి ఉచిత న్యాయ సహాయం అందించబడుతుందని సూచించారు. కార్యక్రమంలో పానల్ లాయర్ కూన కృష్ణారావు, ట్రైనీ మాస్టర్ టి.సుబ్బారావు, సోషల్ వర్కర్ ఎం.అజయ్ బాబు, పాఠశాల ఉన్నత ఉపాధ్యాయులు ఐ.రాజు ప్రసాద్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ జిల్లా కార్యదర్శి ఎమ్.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మధ్యాహ్న భోజన వర్కర్స్ యునియన్ మండల కమిటీ సమావేశం అనసూయ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం ప్రపంచంలో చాలా ప్రాధాన్యత పథకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గొప్పలు చెబుతున్నాయి కానీ ఆచరణలో మాత్రం దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ కేటాయించాలని, 20 ఏళ్లుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతన అమలు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్యాస్ ప్రభుత్వమే ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూఛార్జీలు పెంచాలని, సంవత్సరానికి రెండు జతలు యూనిఫామ్ ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, హై స్కూల్లో పనిచేస్తున్న వర్కర్లకు వేతనం ఇవ్వాలని, రిటర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. రాజకీయ వేధింపులు ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొండలరావు, రోషమ్మ, వెంకటేశ్వరి, కమల, మురళీ పాల్గొన్నారు.

నరసాపురం ఎంపిడిఒ కేసులో మరో ట్విస్టు..!

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఎంపిడిఒ వెంకట రమణరావు ఆత్మహత్య కేసులో మరో ట్విస్టు తెరపైకొచ్చింది. ఈ నెల 15న ఆయన అదృశ్యంపై కృష్ణా జిల్లా పెనుమలూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎనిమిది రోజుల అనంతరం ఎంపిడిఒ ఈ నెల 23వ తేదీన ఏలూరు కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన మృతదేహం దొరకడంతో నిర్ధారణ అయిన సంగతి తెలిసిందే. న్యూడ్ వీడియో కాల్స్ గ్యాంగ్ బెదిరింపులకు ఎంపిడిఒ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పలు ఉత్తరాది రాష్ట్రాల అక్కౌంట్లకు ఎంపిడిఒ నగదు బదిలీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ దిశగా పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఎంపిడిఒను బ్లాక్ మెయిల్ చేసిన నిందితుడిని ఎపి పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఎంపిడిఒ రమణారావు బ్లాక్ మెయిల్ చేసింది రాజస్థాన్ బర్కత్‌పురకు చెందిన వ్యక్తిగా గుర్తించి మూడు రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం అనంతపురం జిల్లా సింగనమల పోలీసులు వేరే కేసులో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఎంపిడిఒ కేసులో అతని ప్రమేయం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ సైబర్ నేరగాడిని కస్టడీకి తీసుకుని విచారణ చేపట్టాలని కృష్ణా జిల్లా పోలీసులు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ గ్యాంగ్‌లో 20 నుంచి 25 మంది ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎపి పోలీసుల కదలికలు గుర్తించి వారంతా పరారైనట్లు తెలుస్తోంది. రమణ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి వారి బెదిరింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని ప్రచారం సాగుతోంది.

ఆటో డ్రైవర్ల సమస్యలపై సమరశీల పోరాటాలు

యూనియన్ ప్రధాన కార్యదర్శి గోపి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరంలోని పాత బస్టాండ్ సెంటర్ త్రిచక్ర ఆటో డ్రైవర్స్ యూనియన్(సిఐటియు అనుబంధం) అధ్యక్ష ఎన్నికలు స్థానిక ఆటో స్టాండ్ నందు మంగళవారం జరిగాయి. ఎన్నికల్లో గెలుపొందిన అడ్డాల రాజు నానికి జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జె.గోపి, ఉపాధ్యక్షులు చక్రాల అమర్ కుమార్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గోపి ఆటో డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యలపై సిఐటియు సమరశీల పోరాటాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఆటో డ్రైవర్లకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని అన్నారు. ఆటో డ్రైవర్లు అందరూ సిఐటియు యూనియన్‌లో చేరాలని పిలుపునిచ్చారు. ఇ-చలానాలు రద్దు చేయాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికులకు ఉరితాడులా మారిన కేంద్ బిఎన్ఎస్ 106(1, 2)లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కోలా రాజా, బి.త్రినాథ్, శివ, బొడ్డేపల్లి చంద్రశేఖర్, మాత్రపు రమేష్ ఎన్నికల నిర్వహణ కమిటీలో ఉన్నారు.

యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

అధిక వర్షాల కారణంగా మండలంలోని వేగవరం గ్రామ పంచాయతీలోని జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌కి వెళ్లే రోడ్డు పాడైనందున విద్యార్థులకు అంతరాయం లేకుండా యుద్ధ ప్రాతిపదికన ఎంపిడిఒ కె.విజయ ప్రసాద్ వెంటనే స్పందించి రోడ్డు వేయించారు. మండలంలోని అధిక వర్షాల కారణంగా ఇంకనూ పాడైన రోడ్లను పరిశీలించారు. వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని ఎంపిడిఒ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేగవరం సర్పంచి నాగరాజు, ఎంపిటిసి 1 సత్యనారాయణ, టిడిపి నాయకులు మాధవరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పాడి రైతులకు సబ్సిడీపై మినీ గోకులాలు

జీలుగుమిల్లి: పాడి రైతులకు సబ్సిడీపై మినీ గోకులాలు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించినట్లు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎమ్.సాయి బుచ్చారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి సంబంధించి ఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారా పశువుల షెడ్ నిర్మాణానికి 90 శాతం సబ్సిడీ, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్‌ల నిర్మాణాలకు 70 శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కావున మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరారు. అదేవిధంగా పశువులకు పశుగ్రాసం పెంచుకోవడానికి స్టేజ్‌ల వారీగా రెండు సంవత్సరాలకి సుమారుగా రూ.85 వేలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

పలుచోట్ల దోమల మందు స్ప్రే

టి.నరసాపురం: మండలంలోని పుట్రేపులో పంచాయతీ సిబ్బంది మంగళవారం దోమల మందు స్ప్రేయింగ్ చేయించారు. దోమల నివారణా చర్యల్లో భాగంగా ఎంపిడిఒ కె.జోగేశ్వరరావు ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, సర్పంచి సునందలు పంచాయతీలో దోమల మందు ట్రాక్టర్ ద్వారా స్ప్రేయింగ్‌కు చర్యలు చేపట్టారు. దీంతో పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో వీధి వీధినా ట్రాక్టర్ ద్వారా తిప్పుతూ స్ప్రేయింగ్ చేయించారు.

ఏలూరు సిటీ: సీజనల్ వ్యాధులు రాకుండా మలేరియా విభాగం వారితో 10వ డివిజన్‌లోని అగ్రహారం, కల్పన థియేటర్ రోడ్డు, హాయ్ టీ సెంటర్ మెయిన్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఉన్న నిలవనీటిలో ఆయిల్ బాల్స్ వేయడం జరిగిందని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బచ్చు మురళీకృష్ణ, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాల్ స్వామి, మలేరియా సూపర్‌వైజర్ డి.దుర్గారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం

ముసునూరు: అన్నే రామబ్రహ్మయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లిలో స్నేహితుల దినోత్సవం పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రవీంద్ర ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహం అనేది ఇద్దరు వ్యక్తుల మధ్య నిస్వార్థ బంధం అని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 2011లో అంతర్జాతీయ స్నేహ దినోత్సవాన్ని ప్రకటించింది. అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఈనెల 30న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. విద్యార్థులు ఒకరినొకరు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జల్లు లక్ష్మి, మల్లేశ్వరి, కృష్ణవేణి, మనోహరం, కోటేశ్వరరావు, సౌజన్య, విరల్ బాబు పాల్గొన్నారు.

ఒకటిన పింఛన్ల పంపిణీ

ముసునూరు: ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల నిమిత్తం మొత్తం 7,973 పింఛనుదారులకు రూ.3,34,19,000లు విడుదలచేసినట్లు ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఒకటవ తేదీ ఉదయం 6 గంటల నుంచి గ్రామ సచివాలయం, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు పింఛనుదారులని ఇంటి వద్దనే పంపిణీ చేస్తారని తెలిపారు. 2వ తేదీ లోపు పింఛన్ తీసుకోవాలని తెలియజేశారు.

టి.నరసాపురం: సచివాలయ సిబ్బంది ఒకటవ తేదీనే పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని ఎంపిడిఒ కె.జోగేశ్వర రావు తెలిపారు. తిరుమల దేవిపేట పంచాయతీ కార్యాలయం వద్ద సచివాలయ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 128 మంది సచివాలయ సిబ్బంది 7,817 పెన్షన్ దారులకు రూ.3 కోట్ల 33 లక్షల 75 వేలు పంపిణీ చేసే విధంగా సిబ్బంది పని చేయాలని తెలిపారు.

117 జిఒను రద్దు చేయాలి

ముదినేపల్లి : ప్రభుత్వ పాఠశాలలకు గుదిబండగా మారిన 117 జిఒను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల అధ్యక్ష కార్యదర్శులు కోరారు. మండల కేంద్రమైన ముదినేపల్లిలోని విద్యా వనరుల కేంద్రం వద్ద మంగళవారం రాష్ట్ర శాఖ నాయకుల ఆదేశాల మేరకు మండల విద్యా శాఖ అధికారి కె.నరేష్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపజేస్తే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

పలుచోట్ల తహశీల్దార్ల బదిలీ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం తహశీల్దార్ జివి ప్రసాద్ మంగళవారం బదిలీపై కైకలూరు తరలి వెళ్లారు. ఎన్నికల నేపథ్యంలో కైకలూరు నుంచి బదిలీపై వచ్చిన ఆయన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తన పూర్వపు విధుల నిర్వహించే ప్రాంతానికి తరలి వెళ్లగా ప్రస్తుత డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రసాద్ ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఆగిరిపల్లి: మండల తహశీల్దార్ బి.మృత్యుంజయరావు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ జి.పవన్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఆయనను మంగళవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐలు నాంచార్య, నవీన్ కుమార్, విఆర్ఒలు, విఆర్ఎలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండల తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్ఎల్ఎన్ కుమారి కైకలూరు తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా గత ఫిబ్రవరి 5న సామర్లకోట నుంచి బదిలీపై ఎన్నికల విధుల నిర్వహించేందుకు ముదినేపల్లి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఆమెకు కైకలూరు రూరల్ తహశీల్దారుగా వెళ్లడంతో ఆమెను మండల విఆర్ఒల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

జీలుగుమిల్లి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి గాయాలైన ఘటన సోమవారం మండలంలోని పి.నారాయణపురం సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కామయ్య పాలెం గ్రామానికి చెందిన వరికూటి నాగేశ్వరరావు(45) ద్విచక్ర వాహనంపై బుట్టాయగూడెం వైపు నుంచి వస్తుండగా పి.నారాయణపురం వద్ద రహదారిపై అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కామయ్యపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

22 కేజీల గంజాయి స్వాధీనం

నలుగురు అరెస్టు

కలిదిండి: గత కొంత కాలంగా గంజాయి తాగడానికి, అక్రమంగా తెచ్చి అమ్మడానికి అలవాటు పడిన ముదినేపల్లి మండలం దేవపూడి గ్రామానికి చెందిన ఎలికే రాజేష్, మండలంలోని సానా రుద్రవరంకు చెందిన తొత్తరం పూడి సురేంద్ర, కలిదిండికి చెందిన కోడాలి నాగేంద్ర వర్మ, కైకలూరుకు చెందిన సయ్యద్ నవాబ్‌ల నుంచి 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కైకలూరు సిఐ వి.కృష్ణ కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గత 15 రోజుల క్రితం గోకవరం గ్రామం నుంచి గంజాయి తెచ్చి, ఆ గంజాయిని మండలంలోని వెంకటాపురం పంట కాలువ వద్ద దాచిపెట్టి అమ్మకానికి పెడుతున్న క్రమంలో ఎస్ఐ ప్రియ కుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకోవడం జరిగిందన్నారు. ఆ నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ప్రియ కుమార్ తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 83339 88814

సమస్యలు పరిష్కరించాలని మహిళల ఆందోళన

ప్రజాశక్తి - మండవల్లి

బిసి కాలనీవాసులు సమస్యలపై గళమెత్తారు. తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ, పందుల స్వైరవిహారంపై మహిళలు సచివాలయాన్ని ముట్టడించి సర్పంచి, కార్యదర్శిని నిలదీసిన సంఘటన మండలకేంద్రమైన మండవల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. మహిళలు తెలిపిన వివరాల ప్రకారం మండవల్లిలోని బిసి కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని గత ఐదేండ్లుగా పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోకపోవడంతో సమస్యలు పూర్తిస్థాయిలో తిష్ట వేశాయని అన్నారు. కుళాయిల ద్వారా వస్తున్న తాగునీరు దుర్వాసన వెదజల్లడంతో పాటు పురుగులు వస్తున్నాయని, ఆ నీటితో స్నానం చేస్తే దురదలతో కూడిన దద్దుర్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిసి కాలనీలోని ప్రధాన రహదారి నిత్యం మురుగునీటితో ఉంటుందని, మురుగునీటిలో రాకపోకలు సాగించలేకపోతున్నామని వారు స్పష్టం చేశారు. మురుగునీరు పందులకు ఆవాసంగా మారడంతో

సచివాలయ అధికారులను నిలదీస్తున్న మహిళలు

మురుగునీటిలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయని, దోమలు వ్యాప్తి చెంది రాత్రి వేళల్లో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దోమల వ్యాప్తితో డయేరియా, డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు పొంచి ఉన్నాయని సర్పంచి దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదని, కనీసం బ్లీచింగ్ కూడా చల్లించిన దాఖలాలు లేవని విమర్శించారు. ఇప్పటికే దురదలతో, జ్వరాలతో బాధపడుతుంటే ఏమీ పట్టనట్లు వ్యవహరించడమే కాకుండా, కాలనీకి పంచాయతీపరమైన సేవలను అందించకుండా, పన్నులు చెల్లించాలంటూ హెచ్చరికలు జారీ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు ఆవేదన చెందారు. సమస్యలు పరిష్కరించేంత వరకూ సచివాలయం వద్ద ఉంటామని స్పష్టం చేశారు. సర్పంచి ఎంతకీ సమాధానం చెప్పకపోవడంతో బిసి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో సర్పంచికి, కార్యదర్శికి ఉన్న నిర్లక్ష్యంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. దీనిపై కార్యదర్శి కల్పించుకుని బిసి కాలనీలో నెలకొన్న సమస్యలు వాస్తవమేనని, తన దృష్టికి వచ్చాయని, సమస్యల పరిష్కారానికి ఇప్పటినుంచే పనులు ప్రారంభిస్తానని చెప్పడంతో మహిళలు కొంత శాంతించినప్పటికీ, సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించకుండా ఉంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించుకునే విధంగా చర్యలు చేపడతామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెండవ వార్డ్ మెంబరు ఇందిర, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఎంఎస్ కె.గాయత్రి ఉన్నారు.

కూచిపూడి జాతీయ పోటీలకు తపస్ విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం తపస్ పబ్లిక్ స్కూల్ ఏడో తరగతి విద్యార్థిని చిరంజీవి సిహెచ్ రూపిక చౌదరి శ్రీశ్రీకళా వేదిక కాకినాడ నందు జరిగిన కూచిపూడి పోటీల్లో ప్రథమ బహుమతిని గెలుచుకుని, ఆగస్టు 18వ తేదీన జరిగే నేషనల్ పోటీలకు ఎంపికైందని తపస్ విద్యాసంస్థల చైర్మన్ దాకారపు కృష్ణ తెలిపారు. కూచిపూడి నాట్యం నేషనల్‌కు సెలెక్ట్ అయిన సందర్భంగా జంగారెడ్డిగూడెం రోటరీ ప్రెసిడెంట్ ఉడా రామ్‌గోపాల్, సెక్రెటరీ తిలక్ భీమిరెడ్డి, తపస్ యాజమాన్యం చైర్మన్ దాకారపు కృష్ణ, సిబ్బంది పాల్గొని ఎంపికైన విద్యార్థిని చిరు సత్కారం చేసి రోటరీ వారు బెస్ట్ పెర్ఫార్మర్ సర్టిఫికెట్‌ను అందజేశారు. విద్యార్థులందరూ చదువులోనే కాకుండా ఇలా ఇతర రంగాల్లో కూడా రాణించి, మెప్పించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తపస్ విద్యాసంస్థల చైర్మన్ దాకారపు కృష్ణ తెలిపారు.

సెక్యూరిటీ, కేర్ టేకర్లు జాగ్రత్తగా పనిచేయాలి

నూజివీడు డిఎస్‌పి లక్ష్మయ్య

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

బాధ్యత, భద్రత కలిగినటువంటి స్థానములో ఉన్న సెక్యూరిటీ, కేర్ టేకర్లు జాగ్రత్తగా పనిచేయాలని నూజివీడు డిఎస్‌పి జి.లక్ష్మయ్య సూచించారు. ఆర్‌జెయుకెటి నూజివీడు క్యాంపస్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ, కేర్ టేకర్లకు మంగళవారం నూజివీడు డిఎస్‌పి జి.లక్ష్మయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంపస్‌లో ఏదైనా అసాధారణ సంఘటనను కనుగొంటే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. తమ పనిలో ప్రతి సెకండ్ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతిఒక్కరూ విధులను పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థుల జీవితాన్ని మెరుగ్గా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జెయుకెటి నూజివీడు నిర్దేశకులు ఆచార్య ఎం.చంద్రశేఖర్, పరిపాలనా అధికారి టి.చంద్రశేఖర్, నూజివీడు టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎంవివిఎస్ఎన్ మూర్తి, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి

రెవెన్యూ డివిజనల్ అధికారి ఖాజావలీ

ప్రజాశక్తి - ఏలూరు

పర్యావరణాన్ని కాపాడుకునేందుకు కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ ప్లాన్ అమల్లో అందరూ సహకరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఖాజావలీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఏలూరు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం కైకలూరు తహశీల్దార్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ ప్లాన్(సి జెడ్ ఎంపీ) ఖరారుకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ అధికారులు, ఫారెస్ట్ అధికారులు, టూరిజం శాఖ, జిల్లా మత్స్యశాఖ, వ్యవసాయ అధికారులు, ప్రజా సంఘాలు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పంచాయతీ, రెవెన్యూ, కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్తగూడెం ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ సిస్టం బహూకరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని నాచుగుంట పంచాయతీ పరిధి కొత్తగూడెం మండల ప్రాథమిక పాఠశాలకు మట్టా పద్మారావు రూ.6,500 విలువగల సౌండ్ సిస్టమును మంగళవారం పాఠశాలకు అందజేశారు. మండల విద్యాశాఖ అధికారి కె.శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యురాలు గంటా ఉషారాణి, ప్రధానోపాధ్యాయులు కొమ్మోజు వెంకటేశ్వరరావు, పాఠశాల సిబ్బంది, యాజమాన్య కమిటీ, తల్లిదండ్రులు దాతను అభినందించారు. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు, తల్లిదండ్రులు సహకరిస్తున్నారని ప్రధానోపాధ్యాయుడు సంతోషం వ్యక్తం చేశారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు మున్సిపాలిటీలో మంగళవారం ఉదయం వార్డుల పరిశుభ్రత కోసం 9, 10, 12 వార్డులలో మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట రామిరెడ్డి ఖాళీ ప్రదేశాల్లో వున్న డంప్ సైట్‌ను తొలిగించారు. పారిశుధ్యం పరిశుభ్రత కార్యక్రమం ప్రతి సచివాలయం పరిధిలో పరిసరాలలో శుభ్రంగా వుంచటకు చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

ఆర్ఎంపి, పిఎంపిలు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లాలోని ఆర్ఎంపిలు, పిఎంపిలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ట మంగళవారం ఒక పత్రికా ప్రకటన ద్వారా సూచించారు. ఎవరైతే ప్రథమ చికిత్స కేంద్రానికి వస్తారో వారిని దగ్గరలో ఉన్న పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలు, గవర్నమెంట్ ఆసుపత్రులకు పంపించాలని తెలియజేశారు. అంతకుమించి రుగ్మతలతో వచ్చిన రోగులకు వైద్యం చేయడం గాని, మందులు, ఇంజక్షన్ల ద్వారా వారికి చికిత్స పేరుతో ఎక్కువ రోజులు జాప్యం చేసి ఆ తర్వాత గవర్నమెంట్ ఆసుపత్రులకు పంపించిన యెడల, అప్పటికే నీరసించి సివియర్ కండిషన్లోకి వెళ్లి, వారు కోలుకోవాలని స్థితిలోనికి వెళ్లవచునని తెలిపారు. ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా అన్ని విధాల నష్టపోతున్నారని అన్నారు. ఆర్ఎంపి, పిఎంపిలు నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నారా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు విద్యాకిట్లు అందజేత

ప్రజాశక్తి - మండవల్లి

పేద విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకుని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, విద్యార్థుల భవిష్యత్తుకు చక్కని బాటలు వేసుకోవాలని భైరవపట్నం సర్పంచి రాగం నాగేంద్రరావు తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర(స్టూడెంట్ కిట్స్) కార్యక్రమంలో భాగంగా ఎంపియుపి పాఠశాలల్లోని విద్యార్థులకు నిర్వహించిన బ్యాగులు, బెల్టు, బూట్లు, ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి నాగదాసి, కిరీటి రాజు, అయ్యవారి రుద్రవరం, వైస్ సర్పంచి ఇంటి నాగరాజు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీసభ్యులు దొక్కుల వెంకట్రావు పాల్గొన్నారు.

కలిదిండి : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర స్టూడెంట్ కిట్లను సద్వినియోగం చేసుకొని, విద్యలో రాణించాలని టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అల్లూరి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మట్టగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. నాగిడి వీర బ్రహ్మం, అంధ్రజు దుర్గారావు, నల్లమోతు వెంకటేశ్వరరావు, తిరుమని పాండురంగారావు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

డ్రెయిన్‌పై దారి నిర్మించిన యువకులు

గ్రామస్తుల అభినందన

పోలవరం : వర్షమొస్తే చాలు పిల్లలు బడికి వెళ్లలేని దుస్థితి నెలకొంది. చిన్న డ్రెయిన్ అటు స్కూలు పిల్లలకూ, ఇటు గ్రామస్తులకు తలనొప్పిగా మారింది. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూడకుండా నలుగురు కుర్రాళ్లు చేయి చేయి కలిపి నడుం బిగించారు. డ్రెయిన్ దాటేందుకు వీలుగా తామే శ్రమదానం చేసి తూరలు వేసేశారు. యువకుల శ్రమదానంతో తూరలు వేయడంతో పిల్లలు బడికి ఎగురుతూ వెళ్తున్నారు. గ్రామస్తులకు నీటిలో దిగే బాధ తప్పిందని ఆనందిస్తున్నారు. ఇదీ పైడిపాక పునరావాస గ్రామం యువకుల విజయగాథ. వివరాల ప్రకారం పోలవరం ప్రాజెక్ట్‌లో ముంపు గ్రామమైన పైడిపాకకు పోలవరం సమీపంలో ఎన్‌టిఆర్ కాలనీ వద్ద పునరావాస కేంద్రంగా కేటాయించారు. పైడిపాక నుంచి నిత్యం ప్రజలు వివిధ పనుల మీద తహశీల్దార్, ఎంపిడిఒ తదితర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లడానికి, సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు వెళ్లడానికి ఇది చాలా దగ్గర మార్గం. ఈ మార్గం గూండా నిత్యం గ్రామస్తులు తిరుగుతూనే ఉంటారు.

తూరలతో దారి ఏర్పాటు చేస్తున్న యువకులు

కాని వర్షకాలం వస్తే అక్కడ ఉన్న డ్రెయిన్ వల్ల వెళ్ల లేని పరిస్థితి. ద్విచక్ర వాహనాలు వెళ్లాలన్నా కనీసం కాలి నడకన వెళ్లటానికి కూడా ఇబ్బందులు పడవలసి వస్తుందని ఆ గ్రామ యువకులు వారా ప్రసాద్, లింగం వీరాంజనేయులు, యంగల బుల్లిరాజు, యంగల రాంబాబులు గమనించి మనమే దారిని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. మంగళవారరం డ్రెయిన్ దాటేందుకు వీలుగా శ్రమ దానం చేసి తూర వేసి వెళ్లడానికి వీలుగా చేశారు. వీరిని గ్రామస్తులు అభినందించారు.

ఎన్‌టిఎ రద్దు చేయాలి

నూజివీడులో ఐసా స్టూడెంట్స్ మార్చ్ విజయవంతం

నూజివీడు టౌన్ : ఎన్‌టిఎ రద్దు చేసి నీట్ ఎగ్జాం మళ్లీ నిర్వహించాలని ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ ఐసా ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అఖిల్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్బంధంగా నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చి అందులో భాగంగా ఉమ్మడి ప్రవేశ పరీక్షలు ప్రవేశపెట్టి, ఈరోజు దేశవ్యాప్తంగా అనేక పరీక్షల్లో అవకతవకలకు ఎన్‌డియే నిలయం అవుతుందన్నారు. ఎన్‌టిఎ నిర్వహిస్తున్నటువంటి ప్రతి పరీక్షలో అక్రమాలతో ముందుకెళ్తూ పేపర్ల లీకులు, పరీక్ష రద్దులు మాస్ కాపీయింగ్ ఇలాంటి అనేక సమస్యలకు తలెత్తుతున్నాయన్నారు. అందుకు నిరసనగా ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ ఆగస్టు 9 పార్లమెంట్ మార్చ్ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా అన్ని జిల్లాల్లో స్టూడెంట్ మార్చ్‌ను నిర్వహించి, కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి తక్షణమే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని అన్నారు. అదేవిధంగా ఉమ్మడి ప్రవేశ పరీక్షల నిర్ణయం రద్దు చేయాలని డిమాండ్‌తో ముందుకు పోవడం జరుగుతుందని తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలో విద్యావ్యవస్థలో అవలంబిస్తున్నటువంటి తప్పుడు ఆలోచన ఉమ్మడి ప్రవేశ పరీక్షా ప్రక్రియను తక్షణమే రద్దు చేయకపోతే రానున్న రోజుల్లో ఉన్నత విద్యకు ఆదరణ లేక అనేక విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలలు, వివిధ సంస్థలు మూతపడే అవకాశం ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించకపోతే రానున్న రోజుల్లో ప్రభుత్వ విద్య అనేది పూర్తిగా నిర్వీర్యమై రాబోయే రోజుల్లో అంబానీ, ఆదాని విద్యాసంస్థల్లోనే విద్యార్థులు చదువుకునే అవకాశాలుంటాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉమ్మడి ప్రవేశ పరీక్షలను రద్దుచేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నీట్, యుజిసి నెట్ పరీక్షలలో జరిగిన అక్రమాలు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడం జరుగుతుంది. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎలాంటి వివరణ ఇవ్వకుండా తమ తప్పులను ఒప్పుకుంటూ ముందుకు పోవడాన్ని తీవ్రంగా ఖండించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డివిజన్ అధ్యక్షుడు వెంకట్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని మొక్కజొన్న రైతుల ఆందోళన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని గవరవరం పాత వర్జీనియా పొగాకు వేలం కేంద్రం గోడౌన్ వద్ద రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. మొక్కజొన్న పంటను అమ్మగా వచ్చిన బకాయి సొమ్ములు చెల్లించాలంటూ పోలవరం మండలానికి చెందిన రైతులు మంగళవారం ధర్నా చేశారు. వివరాల్లోకెళితే.. సుమారు రూ.3 కోట్ల విలువైన మొక్కజొన్న పంటను రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి, పోలవరం మండలానికి చెందిన దళారి పంటను కొనుగోలు చేసి, దళారి చింతలపూడి మండలానికి చెందిన మరొక ధాన్యం వ్యాపారికి అమ్మిన వైనం చోటుచేసుకుంది. తిరిగి మళ్లీ చింతలపూడి ధాన్యం వ్యాపారి ఆ పంటను కొయ్యలగూడెం మండలానికి చెందిన ధాన్యం వ్యాపారులకు అమ్మడం జరిగింది. కొనుగోలు చేసిన మండల వ్యాపారులు

పురుగు మందుల డబ్బాలతో ఆందోళన చేస్తున్న రైతులు

గవరవరం సమీపంలోని ప్రయివేటు గోడౌన్‌లలో భద్రపరచగా పంటను అమ్ముకున్న రైతులు వందమందికిపైగా వచ్చి గోడౌన్ వద్ద ఆందోళన చేపట్టారు. తమకు అధికారులు న్యాయం చేయాలి అంటూ పురుగుమందు సీసాలతో బైఠాయించి నిరసన తెలిపారు.

సమస్యలపై అధికారుల నిలదీత

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశంలో పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులను నిలదీశారు. వడాలి సభ్యులు మాట్లాడుతూ పాఠశాలలో జరిగే కార్యక్రమాలను జెడ్‌పిటిసి సభ్యురాలికి చెప్పకుండా, ప్రొటోకాల్ పాటించకపోవడం మండల విద్యాశాఖ అధికారి నరేష్ కుమార్ అనుసరిస్తున్న తీరుపై ధ్వజమెత్తారు. మరోసారి ఇలా జరిగితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. కోమర్రు సభ్యులు మాట్లాడుతూ శ్రీహరిపురం గ్రామ సచివాలయ శిలాఫలకంపై కోమర్రు సర్పంచి పేరు లేకపోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. సిబి కెనాల్ నుంచి మంచినీటి చెరువుకు నీరు పెట్టే పంట బోదె డెక్కతో దట్టంగా నిండిపోయిందన్నారు. డెక్క తొలగించాలంటూ ఉపాధి హామీ చట్టం అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామానికి డిమ్ము కరెంటు వస్తుందని, తమ లైన్ 24 గంటలు విద్యుత్ సరఫరా చేసే లైన్లో కలపాలని ఎఇ రవికుమార్‌ను కోరారు. బిఎండి ఛానల్‌కు అరకొరా నీరు విడుదల కారణంగా పంటలు ఎండిపోతున్నాయని, పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని, వెంటనే ఛానల్‌కు పూర్తిస్థాయిలో సాగునీటిని విడుదల చేయాలని వాడవల్లి సభ్యులు కోరారు. ఎఇ రవికుమార్ మాట్లాడుతూ మండలంలో ఐదు సబ్ స్టేషన్ ద్వారా ప్రజలకు ఎలాంటి విద్యుత్తు అంతరాయం లేకుండా నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి పాటుపడాలన్నారు. అయితే ఈ సమావేశంలో మహిళా సభ్యుల స్థానంలో వారి భర్తలు సభకు హాజరు కావడం పలు విమర్శలకు దారి తీసింది. ఈ సమావేశంలో ఎంపిడిఒ గంగాధర్ రావు, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపిలు సిహెచ్ సునీత, రాచూరి రాధా, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యాన విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని 9వ వార్డులో గల ఎంపిపి స్కూల్‌లో పిల్లలకి అవసరమైన నోట్‌బుక్స్, సామాగ్రిని మానవత ఆధ్వర్యాన అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత కొయ్యలగూడెం శాఖ అధ్యక్షులు మాటూరి సుధీర్, కార్యదర్శి సాయికృష్ణ, నక్క బాబి, శేఖర్, మోహన్‌రావు, బొమ్మ మోహన్ రావు, చంటి, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ గుప్తా, గణేష్ ఉన్నారు.

నారాయణపురం డిగ్రీ కాలేజీలో ఎంకామ్ కోర్స్ ప్రారంభం

ఉంగుటూరు: మండలంలోని నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంకామ్ కోర్సు ప్రారంభం కానుంది. ఈ క్రమంలో కోర్సు ప్రారంభించేందుకు చేసిన ఏర్పాట్లు, వసతులను పరిశీలించేందుకు రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ల బృందం పి.అశోక్, ఎన్.ఉదయ్ భాస్కర్‌లు మంగళవారం వచ్చారు. కాలేజీ ప్రాంగణం తరగతి గదులను పరిశీలించారు. ఈ కాలేజీలో ఎంకామ్ కోర్సుకి అనువైన వసతులు ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ విశ్వేశ్వరరావు, ఎంకామ్ కోఆర్డినేటర్ పి.బాబురావు పాల్గొన్నారు.

ఎంఇఒ ప్రభాకరబాబుకు ఘన సన్మానం

కలిదిండి : మండల విద్యా శాఖాధికారి పిడుగు ప్రభాకర బాబు ఈనెల 31న పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా మంగళవారం స్థానిక శశి హై స్కూల్‌లో ఆయనను మండల ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుశ్శాలువా, పూలమాలలు వేసి, జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. తన సర్వీసు కాలంలో ఒక్క రోజు కూడా సెలవును ఉపయోగించుకోకుండా పిడుగు ప్రభాకర బాబు పనిచేయడం గొప్ప విషయం అని ఎపి ప్రయివేటు స్కూల్స్ డెమొక్రటిక్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు చన్నంశెట్టి కృష్ణ అన్నారు. కైకలూరు డివిజన్ అధ్యక్షులు ఎవి.కోటేశ్వరరావు, శశి, వివేకానంద పాల్గొన్నారు.

పథకాలకు సమాజ సేవకుల పేర్లు అభినందనీయం

ఎంఎల్ఎ సొంగా రోషన్

చింతలపూడి : భావితరాలకు స్ఫూర్తి అందించిన సమాజ సేవకులు, విద్యావేత్తల పేర్లతో ప్రభుత్వ పథకాలను అమలు చేయడం హర్షనీయమని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. రాష్ట్ర విద్యాశాఖలో పథకాలకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, డొక్కా సీతమ్మ, అబ్దుల్ కలాం పేర్లతో అమలు చేయాలని తీసుకున్న నిర్ణయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో అన్ని పథకాలను ముఖ్యమంత్రి తానే పేర్లు పెట్టుకున్నరాని, ఆ దుష్ట సాంప్రదాయానికి మంగళం పాడి విద్యార్థులలో స్ఫూర్తిని కలిగించే వారి పేర్లతో పథకాలను అమలు చేయడం హర్షనీయమని అన్నారు.

పిహెచ్‌సిని సందర్శించిన ఎంఎల్ఎ

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్యం సరిగ్గా జరుగుతుందా లేదా అని ఆరా తీశారు. బుట్టాయగూడెం ఆసుపత్రి ప్రయివేట్ ఆసుపత్రులకి దీటుగా ఉందని ఇంత మంచి వాతావరణంలో రోగులకు పూర్తి ఆరోగ్యాన్ని వైద్యాన్ని అందిస్తున్న అధికారులను, వైద్యులను అభినందించారు. సూపరిటెండెంట్ వసుంధర ఎంఎల్ఎ బాలరాజుతో మాట్లాడుతూ ఆసుపత్రిలో జనరేటర్ సమస్య ఉందని ఆ సమస్యను పరిష్కారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన హాస్పటల్ అభివృద్ధికి చేయవలసిన తమ వంతు సహకారం అందిస్తామని, ఉన్నతాధికారులతో మాట్లాడి ఆసుపత్రిలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలియజేశారు.

'ఎపి అంటే కేంద్రానికి చిన్నచూపు'

కొయ్యలగూడెం: ఎపి అంటే కేంద్రానికి ఇంత చిన్నచూపా అని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. పట్టణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్లు అప్పుగా ఇచ్చిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల నారాయణరావు, వెలగల నాని, ఎస్.గిరి, మట్ట రామకృష్ణ, వెలగల రామారావు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONBLE I-ADDL JUNIOR CIVIL JUDGE, ELURU, W.G.Dt.
I.A.No.218/2016 in O.S.No.231/2016
Between:
Pulavarthi Deva Raju and another ...Petitioners/ Plaintiffs
And
Ventrapati Rambabu and 4 Others ...Respondents/Defendants
R5 : Byvarapu Veeamma, w/o.veerraju, Hindu, Female, Aged 40 Yrs, R/o.Kavvagunta Village, Eluru (M), W.G.Dt.
మీరు పైన తెలిపిన I.A.No.218/2016 లోను O.S.No.231/2016 లోను మీరు 5వ ప్రతివాది అయివున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పైన తెలిపిన Hon'ble Ist Addl. Junior Civil Judge, Eluru కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం మీరు ఆగస్టు 16వ తేదీ 2024వ సంగరం ఉదయం 10.30 గంలకు హాజరు కావలెను. లేని యెడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది. (శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం వాయిదా తేది. 16-8-2024)
Tumeti Ganga Raju, Advocate, Eluru. Cell: 6301538896